

కళాశాల వివరాలు తెలుసుకుంటున్న జేఎన్‌టీయూ బృందం

ఎండిన నదిలో.. పచ్చని పంటలు



నీరు తగ్గడంతో పాయలా మారిన కృష్ణానది

- కృష్ణానదిలో నీరు తగ్గాక సాగు చేస్తున్న రైతులు
- భూములు తేమగా ఉండటంతో అధిక దిగుబడులు
- నీటి తడులు అవసరం లేకుండానే సాగు



జటప్రోల్ శివారులో సాగు చేసిన పుచ్చకాయ తోట



పెంట్లవెల్లి మండలం వెంకల్ దగ్గర కృష్ణానదిలో ఏపుగా పెరిగిన జొన్న

పెంట్లవెల్లి, జనవరి24: నీరు లేక ఎండిన కృష్ణానదిలో రైతులు సిరుల పంటలు పండిస్తున్నారు. అధిక దిగుబడులు సాధించి ఆదర్శంగా నిలుస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా కృష్ణానదిలో నీటి ముంపునకు గురైన నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలం మంచాలకట్ట, మల్లేశ్వరం, జటప్రోల్, వెంకల్, మాధవస్వామినగర్ గ్రామాల్లోని 1,500 ఎకరాల్లో నదిలో నీరు లేనప్పుడు రైతులు వివిధ రకాల పంటలు వేస్తున్నారు. ఏటా జూన్, జూలై నెలల్లో కృష్ణానది నిండుగా పారుతుంది. నదిలో నీరు తగ్గాక పంటలు సాగు చేస్తారు. ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురవడం, నది నుంచి ఇటు తెలంగాణ.. అటు ఆంధ్రప్రదేశ్ నీటిని తరలించడంతో అక్టోబరు, నవంబరు నుంచే నదిలో నీరు తగ్గడం మొదలైంది. నీరు తగ్గడంతో నదిలో తేలిన పొలాలను రైతులు సాగు చేశారు. గతంలో ఉన్న భూముల హద్దులను సరి చేసుకుని, మరికొందరు కౌలుకు తీసుకుని పంటలు వేశారు. ఈ ఏడాది అక్టోబరు, నవంబరులో వేరుశనగ, పొద్దుతిరుగుడు, మినుములు, నువ్వులు, మొక్కజొన్న, శనగ వంటి వివిధ రకాల పంటలతో పాటు పుచ్చకాయ తోట పెట్టారు. భూములు దాదాపు ఆరు నెలల పాటు నీటిలో మునిగి ఉండడం వల్ల సారవంతంగా మారి, అధిక దిగుబడులు పొందుతున్నారు. పంటల్లో ఎలాంటి కలుపు మొక్కలు రావని రైతులు చెబుతున్నారు. అదేవిధంగా ఎలాంటి రసాయన ఎరువులు కూడా వేయబోమని అంటున్నారు. మంచాలకట్ట, జటప్రోల్, మాధవస్వామినగర్ గ్రామాలల్లో బంకమట్టి, నల్లరేగడి భూములు ఉండటంతో భూమిలో ఉండే తేమకే పంటలు పండుతాయి. వెంకల్, మల్లేశ్వరం గ్రామాల్లోని రైతులు మాత్రం నదిలోనే బోర్లు, పైపుల ద్వారా నది నీటిని పారబెట్టి పంటలు పండిస్తున్నారు. ఈ సంవత్సరం కృష్ణా నది పూర్తి స్థాయిలో నిండలేదు. దాంతో తొందరగా ఎండింది. ఈ నేపథ్యంలో ఏ పంటలైనా సాగు చేయొచ్చన్న ఉద్దేశంతో భూముల కౌలు ధర కూడా అధికంగా పలికింది. ఎకరం రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ధర పలికింది.



మంచాలకట్టలో కోతకు వచ్చిన శగన పంట



కట్టలు కట్టిన నువ్వుల చేను



మల్లేశ్వరంలో సాగు చేస్తున్న నువ్వుల పంట

కోస్గికి ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల మంజూరు

- పరిశీలించిన జేఎన్‌టీయూ ప్రొఫెసర్ల బృందం
- రాష్ట్రంలోనే మొట్టమొదటి గవర్నమెంట్ కాలేజీ
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు ప్రారంభించనున్నట్లు వెల్లడి

కోస్గి రూరల్ జనవరి 24: నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దాంతో రాష్ట్ర ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్లు బుధవారం కళాశాలను పరిశీలించారు. జేఎన్‌టీయూ ప్రొఫెసర్లు చంద్రమోహన్, ఉజ్వలరేఖ(కంప్యూటర్ సైన్స్), రజిని(ఈసీఈ హెడ్‌డిపార్ట్‌మెంట్) బృందం తనిఖీ చేసింది. కళాశాలలోని వసతులు, తరగతి గదులు, పరికరాలు, కంప్యూటర్ల గురించి ప్రిన్సిపాల్ పరమేశ్వరిని అడిగి తెలుసుకున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంజనీరింగ్ విభాగంలో అడ్మిషన్లు తీసుకుంటామన్నారు. అందుకు అనుగుణంగా వసతులను పరిశీలిస్తున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రఘువర్ధన్‌రెడ్డి, విజయ్‌కుమార్, అన్న కిష్టప్ప, నాగులపల్లి నరేందర్ పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం

- నవాబ్‌పేట మండలం మల్లారెడ్డిపల్లిలో ఘటన

నవాబ్‌పేట, జనవరి 24: మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు అదృశ్యమైంది. ఇన్‌చార్జి ఎస్‌ఐ సురేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్లారెడ్డిపల్లికి చెందిన కొత్త పద్మమ్మ(60) ఈ నెల ఏడున ఉదయం పది గంటలకు ఇంటి నుంచి బయటికి వెళ్లింది. కొడుకు శ్రీనివాసులు బంధువుల ఇళ్ల వద్ద వెతికినా కనిపించ లేదు. దాంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్‌ఐ తెలిపారు.

అచ్చంపేటకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్

- రూ.25 కోట్లతో ఏర్పాటు
- స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ స్థలంపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అచ్చంపేట, జనవరి 24: నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ మంజూరైంది. రూ.25 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఈ సెంటర్ కోసం స్థలాన్ని ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ ఆర్డీవో గోపిరావు, ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఎన్టీఆర్ మినీ స్టేడియం సమీపంలో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే వంశీకృష్ణ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నాక్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను అచ్చంపేటతో పాటు నల్గొండ జిల్లాలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రం ద్వారా నల్లమల ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి, వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఈ సెంటర్ ఏర్పాటుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఆ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలకు నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

తుల్జాభవానీ సంబురం



సంప్రదాయ దుస్తుల్లో గిరిజనులు

వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలం దొంతికుంట తండాలో గిరిజనులు తుల్జా భవానీ పండుగను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. రెండేళ్లకోసారి జరిగే ఈ వేడుక కోసం గిరిజనులు ఇంటి దేవతను ఇళ్లలో ప్రతిష్ఠించుకుంటారు. సంప్రదాయ దుస్తులు ధరించి, ఆమెను కొలుస్తారు. పండుగ దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది.

\- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటో గ్రాఫర్, వనపర్తి



ఓ ఇంటి వద్ద ప్రతిష్ఠించిన తుల్జాభవానీ అమ్మవారు



సామూహిక పూజల్లో పాల్గొన్న గిరిజనులు



వంట చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్న మహిళలు



వంటలు చేస్తున్న గిరిజన మహిళ



బియ్యం చెరుగుతున్న యువతి

బైక్, లారీ ఢీకొని ఒకరి దుర్మరణం

వంగూరు, జనవరి 24: బైక్, లారీ ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం సర్వారెడ్డిపల్లి గేటు సమీపంలో బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వెల్దండ మండలం కొత్త గ్రామానికి చెందిన శ్రీను(40) వంగూరు మండలం సర్వారెడ్డి పల్లి గేటు సమీపంలో జరుగుతున్న షరీఫ్ దర్గా ఉత్సవాల్లో మటన్ సీకులు కాల్చే దుకాణం పెట్టాడు. మంగళవారం రాత్రి రోడ్డు పక్కనే బైక్‌ను పెట్టుకొని, దాని పక్కనే నిద్రించాడు. బుధవారం తెల్లవారుజామున ఒక లారీ వేగంగా వచ్చి, బైక్‌ను ఢీకొట్టింది. బైక్ శ్రీను తలపై పడి, తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే 108 అంబులెన్స్‌లో కల్వకుర్తికి తరలిస్తుండగానే మార్గం మధ్యలోనే మృతి చెందాడు. శ్రీనుకు భార్య సుమిత్ర, ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. కేసు దార్యప్తులో ఉంది.

కాలకేయుడిని చంపినోడే బాహుబలి

- పాలమూరులో రాక్షసపాలన ముగిసింది
- సీడబ్ల్యూసీ ఆహ్వానితుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీచంద్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జనవరి 24: 'పాలమూరులో రాక్షస పాలన ముగిసింది. ప్రజా పాలన మొదలైంది. ప్రజలంతా ప్రశాంతంగా ఉన్నారు. కాలకేయుడిని చంపినోడే బాహుబలి'అని సీడబ్ల్యూసీ ఆహ్వానితుడు, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని జేజేఆర్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షత వహించారు. వంశీచంద్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పదేళ్లుగా పాలమూరు ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపారని, వ్యాపారం చేసుకుందామన్నా భయపడేవారన్నారని చెప్పారు. గత పాలనలో భూకబ్జలతో పాటు బెదిరింపులకు పాల్పడేవారన్నారు. ఇప్పుడు అవన్నీ పోయి, ప్రజలు ప్రశాంతంగా జీవనం గడుపుతున్నారన్నారు. మహబూబ్‌నగర్‌లో త్వరలోనే రూ.15 కోట్లతో క్రికెట్ మైదానం ఏర్పాటుకు బీసీసీఐతో మాట్లాడినట్లు తెలిపారు. పార్లమెంట్ నియోజకవర్గంలో రూ.1,000 కోట్లతో పార్లేజీ బిస్కెట్ కంపెనీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పని అయిపోయిందని, పాలమూరులో అరాచక శక్తుల ఆటలు సాగవన్నారు. ఇక్కడ బీఆర్‌ఎస్ మూలాలు లేకుండా చేస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత కేసీఆర్, కేటీఆర్, మాజీ మంత్రులు తట్టాబుట్ట సర్దుకొని దిక్కులేని చోటకు వెళ్లడం ఖాయమన్నారు. బీఆర్‌ఎస్‌ను ఓడించామని, బీజేపీని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ పరిధిలోని బీఆర్‌ఎస్ నాయకులు తనకు నిత్యం ఫోన్ చేసి, కాంగ్రెస్‌లో చేరతామని అడుగుతున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో వంశీచంద్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. పార్టీ గెలుపు కోసం కృషి చేసిన కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. పార్లమెంట్ స్థానాన్ని గెలిపించి, సీఎంకు కానుకగా ఇద్దమని మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ తర్వలోనే భూ భకాసురుల భరతం పడామన్నారు. ఇతర పార్టీల నాయకులను తమ పార్టీలోకి తీసుకోమన్నారు. సమావేశంలో ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

నేడు సూగూరు కోదండరామస్వామి ఆలయంలో సామూహిక వ్రతాలు

పెబ్బేరు రూరల్, జనవరి 24 : వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం సూగూరు గ్రామంలోని కోదండరామస్వామి ఆలయంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో గురువారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించనున్నామని తిరుమల తిరుపతి శ్రీవారి సేవకులు సితార వెంకటేశ్వర్లు తెలిపారు. సామూహిక వ్రతాలు చేయదలుచుకున్న భక్తులు అధిక సంఖ్యలో తరలి రావాలని ఆయన పేర్కొన్నారు.

అడవి మృగాల దాడిలో రెండు దూడల మృతి

- చంపింది చిరుతనా?, హైనానా.?
- మూగజీవాలపై దాడితో రైతుల ఆందోళన

ఖిల్లాఘణపురం, జనవరి 24 : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలోని షాపూర్, మానాజీపేట గ్రామాల శివారు ప్రాంతాల్లో మంగళవారం రాత్రి వేర్వేరు ప్రాంతాల్లో అడవి మృగాల దాడిలో రెండు దూడలు మృతి చెందాయి. మండలంలోని షాపూర్ గ్రామ శివారు ప్రాంతంలో కర్నేతండా సాగునీటి కాలువ వద్ద మామిళ్ల భీమయ్యకు చెందిన బర్రె దూడ అడవి మృగాల దాడిలో మృతి చెందిందని బాధితుడు వాపోయాడు. అదేవిధంగా, మానాజీపేట గ్రామ శివారులో సాగునీటి కాలువ దగ్గర హరిజన కర్రె చెన్న నరసింహకు చెందిన లేగ దూడపై అడవి మృగం దాడి చేసి చంపిందని బాధిత రైతు కన్నీరు మున్నీరయ్యాడు. మండలంలో రెండు నెలలుగా తరచు అడవి మృగాలు మూగజీవాలపై దాడి చేస్తున్నా సంబంధిత శాఖ అధికారులు మాత్రం నామమాత్రపు గాలింపు చర్యలు చేపడుతున్నారని ప్రజలు వాపోతున్నారు. ఈ విషయంపై అటవీశాఖ డిప్యూటీ రేంజర్ భాస్కరాచారిని వివరణ కోరగా పశువులపై తరచుగా గుర్తు తెలియని అడవి మృగం దాడులు చేయడం వాస్తవమేనని, దాడులు జరిగిన ప్రాంతంలో చిరుత అడుగుజాడలు స్పష్టంగా కన్పించడం లేదని అన్నారు. మండలంలో సంచరిస్తున్నది చిరుతనా, హైనానా అనే అనుమానం ఉందని పేర్కొన్నారు. దాడిలో మరణించిన మూగజీవాలకు నష్టపరిహారం అందజేస్తామని ఆయన తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వీపనగండ్ల, జనవరి 24 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై రవిప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం పసుపుల గ్రామానికి చెందిన సుప్పరి సురేష్(27) ఈనెల 22న అమ్మాయిపల్లి నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. అదే సమయంలో బొల్లారం చౌరస్తా నుంచి వీపనగండ్లకు చెందిన నరసింహ స్వగ్రామానికి వస్తున్నాడు. తూముకుంట సమీపంలో ప్రమాదవశాత్తు రెండు బైకులు ఢీకొన్నాయి. ప్రమాదంలో తీవ్రంగా గాయప డిన సురేష్ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం బ్రెయిన్ డెడ్‌తో మృతి చెందినట్లు ఎస్సై వివరించారు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. సురేష్ అవయవాలను దానం చేస్తున్నట్లు అతని కుటుంబ సభ్యులు తెలిపినట్లు ఎస్సై చెప్పారు.





‘రెవెన్యూ’ వద్ద ఆ భూమి రికార్డుల్లేవ్!

- హైదరాబాద్-శ్రీశైలం హైవే భూమి వివరాలివ్వాలని ఎన్‌హెచ్‌ఏఐకు వినతి
- ‘రహదారికీ రైతుబంధు’పై విస్తృత చర్చ
- ‘ఆంధ్రజ్యోతి’ కథనంపై అధికారుల ఆరా

ఆమనగల్లు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ‘రహదారికీ రైతుబంధు’ శీర్షికన బుధవారం ‘ఆంధ్రజ్యోతి’లో ప్రచురితమైన కథనం సర్వత్రా చర్చనీయాంశమైంది. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి నిర్మించిన భూమికి ప్రభుత్వం ఏళ్లుగా రైతుబంధు సొమ్ము ఇస్తూ వచ్చిన వైనాన్ని ‘ఆంధ్రజ్యోతి’ బయటపెట్టింది. అయితే రోడ్డు నిర్మించిన భూమికి సంబంధించి రెవెన్యూ అధికారుల వద్ద సరైన రికార్డులు లేనట్లు సమాచారం. దాంతో ఆ రికార్డులు అందజేయాలని రెవెన్యూ అధికారులు.. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులను కోరినట్లు తెలిసింది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు, కడ్తాల్ మండలాల్లో ఈ సమస్య వెలుగుచూసింది. రోడ్డు కోసం పట్టా భూములను సేకరించినా దానికి అనుగుణంగా రికార్డుల్లో మార్పు చేయలేదు. గత ప్రభుత్వ లోపాల వల్ల ఈ భూమికి రైతుబంధు సహాయం అందుతుండడమే కాక మరో సమస్య కూడా తలెత్తుతోంది. భూముల ధరలకు రెక్కలు వస్తుండడంతో చాలామంది రైతులు జాతీయ రహదారి ఉన్న భూమిని కూడా ధరణి రికార్డుల ఆధారంగా విక్రయించి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. ఇదే జరిగితే పెద్దఎత్తున వివాదాలు చోటు చేసుకునే అవకాశాలు లేకపోలేదు. ఇటీవల కడ్తాల- మైసిగండి మధ్య రోడ్డు నిర్మాణం జరిగిన 1.20 ఎకరాల భూమి.. ధరణి పాస్ పుస్తకంలో కూడా ఉండడంతో రూ.5 కోట్లకు విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దాన్ని వేరొకరికి రిజిస్ట్రేషన్ చేయకుండా బ్లాక్‌లిస్టులో పెట్టాలని రాష్ట్ర ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు అందింది.



హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి

కాగా, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను రికార్డులు అడగడంతో పాటు రోడ్డు ఉన్న సర్వే నంబరు భూములను పరిశీలించి సంబంధిత రైతుల రికార్డుల నుంచి ఆ భూమిని తొలగించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఇటు ప్రభుత్వం ఈ విషయమై ఉన్నతస్థాయి విచారణ జరిపిస్తే అనేక విషయాలు వెలుగుచూసే అవకాశం ఉందన్న అభిప్రాయం స్థానిక ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ఆమనగల్లుకు చెందిన ఓ రైతు ఇటీవల స్థానిక తహసీల్దార్‌కు, కడ్తాల్‌కు చెందిన మరో రైతు ప్రజావాణిలో సీఎం రేవంత్ రెడ్డికి ఇదే విషయమై ఫిర్యాదు చేశారు.

కేసీఆర్‌ను సీఎం చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

సమావేశానికి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బాధాకరమేమీ కాదని, చాలా చిన్న దెబ్బ మాత్రమే తగిలిందని అన్నారు. "ప్రజలు మనల్ని ఛీకొట్టలేదు. 39 స్థానాల్లో గెలిచాం. మరో 14 స్వల్ప తేడాతో ఓడాం. ఆ 14 స్థానాల్లో ఇతర పార్టీలు గతంలో రెండు, మూడు, నాలుగుసార్లు వరుసగా పోటీచేసి.. ఒక్కసారైనా గెలిపించాలంటూ ఏడవడంతో ప్రజలు భావోద్వేగాలతో వారికి ఓటేశారు. ఇందులో ఆరేడు స్థానాలు బీఆర్ఎస్ గెలిస్తే ఎలా ఉండేది? 1.85 శాతం ఓట్ల తేడాతో మాత్రమే అధికారం కోల్పోయాం" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజల తీర్పు ను అవమానపరిచే విధంగా మాట్లాడవద్దని పార్టీ శ్రేణులు, సోషల్ మీడియా వారియర్స్‌కు సూచించారు. "కరీంనగర్ లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో కరీంనగర్, సిరిసిల్ల, హుజూరాబాద్‌లో గెలిచాం. మిగిలిన నాలుగింటిలో కూడా వారు సానుభూతితోనే గెలుపొందారు. అయినా మనకంటే వారికి కేవలం ఐదారు వేల ఓట్లు మాత్రమే ఎక్కువ వచ్చాయి. ఈ ఏడుపు, సానుభూతి ఎప్పటికీ ఉండదు" అని వ్యాఖ్యానించారు.

420 హామీలతో ప్రజలను నమ్మించారు..

ఎన్నికల్లో తప్పుడు హామీలతో రేవంత్‌రెడ్డి ప్రజలను నమ్మించారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలే కాకుండా.. మేనిఫెస్టోలో పేర్కొన్నవన్నీ కలిపి 420 హామీలు ఇచ్చారని, వాటిని ప్రజలకు వివరించి అమలయ్యే వరకు పోరాడుదామని పిలుపునిచ్చారు. హామీలు అమలు చేయకుంటే రోడ్డుపై బట్టలూడదీసి ప్రభుత్వాన్ని నగ్నంగా నిలబెడతామని హెచ్చరించారు. సోషల్ మీడియాను పదునుగా వాడుకొని నరేంద్రమోదీ ప్రధానమంత్రి, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని చెప్పారు. రైతు భరోసా ఇచ్చామంటూ రేవంత్‌రెడ్డి దావోస్‌లో పచ్చి అబద్ధం చెప్పారని, రైతుబంధు పేరు మార్చారే తప్ప.. డబ్బులు ఇవ్వలేదని తెలిపారు. రైతుబంధు పడలేదంటే చెప్పుతో కొడతామంటూ మంత్రి కోమటిరెడ్డి చేసిన వాఖ్యలపై కేటీఆర్ మండిపడ్డారు. రైతు భరోసా రాని70 లక్షల మంది రైతులు ఈ ప్రభుత్వాన్ని చెప్పుతో కొడతారో, ఓట్లతో కొడతారో ఆలోచించుకోవాలన్నారు. క్వింటాల్ ధాన్యానికి ఇస్తామన్న రూ.500 బోనస్ ఇచ్చి తీరాలని డిమాండ్ చేశారు. మార్పు కావాలని ఓట్లు వేసిన 6.5 లక్షల ఆటో కార్మికుల కుటుంబాల కొంప కొల్లేరు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు వారికి ఏ అవకాశమచ్చినా కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎరువులు, విత్తనాల దుకాణాల వద్ద క్యూ కట్టాల్సి వస్తుందని ఎవరూ అనుకోలేదని, మళ్లీ ఆ రోజులు వచ్చాయని విమర్శించారు. బస్సుల సంఖ్యను పెంచకుండా, బస్సుల కండిషన్ ఎలా ఉందో తెలుసుకోకుండా అనాలోచితంగా మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయడంతో బస్సుల్లో వారు కొట్టుకుంటున్నారని తెలిపారు. మరోవైపు డబ్బులు పెట్టుకొని వెళ్లే పురుషులకు సీట్లు దొరకడం లేదని, ఎవరూ సంతృప్తిగా లేరని అన్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలోని కోటి 57 లక్షల మంది మహిళలకు నెలకు 2,500 ఇవ్వకుంటే తాట తీయాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారని అసెంబ్లీలో ప్రశ్నిస్తే.. తాము ఆ హామీ ఇవ్వలేదని భట్టివిక్రమార్క అన్నారని చెప్పారు.



బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ భేటీలో మాట్లాడుతున్న కేటీఆర్

మతం, దేవుళ్లతో బీజేపీ రాజకీయం..

బీజేపీ ఎంపీలు మతం, దేవుళ్లతో దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. నిత్యం మతం, ధర్మం అంటూ రెచ్చగొడుతూ కరీంనగర్‌లో గెలిచిన బండి సంజయ్‌కుమార్ అట్టర్ ఫ్లాప్ ఎంపీ అని విమర్శించారు. వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట రామాలయానికి మోదీ నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదన్నారు. ఐదేళ్లలో సంజయ్ చేసిన అభివృద్ధి ఏంటో మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నలుగురు ఎంపీలను ఓడించింది బీఆర్ఎస్ కాదా? రెండు పార్టీలు ఒకటైతే కామారెడ్డిలో కేసీఆర్ ఓడిపోయేవారా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మోదీ, అదానీ ఒకటేనంటూ రేవంత్, రాహుల్ గాంధీ ప్రచారం చేశారని, ఇప్పుడు ఆయనతోనే ఒప్పందం కుదుర్చుకున్నారని విమర్శించారు. బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్‌లో మోదీ, అదానీ తరువాత.. రేవంత్ మూడో ఇంజన్‌గా మారారన్నారు. కేసీఆర్ సర్కారు పదేళ్లు అదానీని రాష్ట్రంలో అడుగుపెట్టనీయలేదని, అమిత్‌షా, మోదీ సూచనతోనే అదానీతో రేవంత్ ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని విద్యుత్ ప్రాజెక్టులు, ఇతర సంస్థలను అదానీకి కట్టబెడతారన్నారు. రేవంత్ మరో ఏక్‌నాథ్ షిండే అయినా ఆశ్చర్య పోవలసిన అవసరం లేదని, మైనారిటీలు ఆలోచించాలని సూచించారు.



మీడియాతో ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, మహిపాల్‌రెడ్డి

విపక్ష ఎమ్మెల్యేలు సీఎంను కలవకూడదా?


- రేవంత్ తెలంగాణ రాష్ట్రానికి సీఎం కాదా?
- సమస్యల పరిష్కారం కోసమే కలిశాం
- పార్టీని వీడేది లేదు.. ప్రతిపక్షంలోనే ఉంటాం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీత, ప్రభాకర్‌రెడ్డి మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు స్పష్టీకరణ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):"కాంగ్రెస్ పార్టీకే.. రేవంత్ ముఖ్యమంత్రా? తెలంగాణకు కాదా? నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం ప్రతిపక్ష నేతలు సీఎంను కలవకూడదా?" అని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, కె.మాణిక్‌రావు ప్రశ్నించారు. తాము కాంగ్రెస్‌లో చేరుతున్నామంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. రెండ్రోజుల క్రితం ఈ నలుగురు ఎమ్మెల్యేలూ సీఎం రేవంత్‌ను కలవడంతో వారు పార్టీ మారుతున్నారన్న ప్రచారం జోరందుకుంది. ఈ నేపథ్యంలో వారు బుధవారం మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌ను మర్యాదపూర్వకంగానే కలిశామని, ప్రజాసమస్యలను చర్చించడంతోపాటు సెక్యూరిటీ, ప్రొటోకాల్ సమస్యలపై కూడా మాట్లాడామన్నారు. ప్రతిపక్షంలో ఉంటే సీఎంను, మంత్రులను కలవకూడదా? ప్రధాని మోదీని, కేంద్రమంత్రులను సీఎం రేవంత్ కలవడం లేదా అని ప్రశ్నించారు. తమ నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం, అభివృద్ధి అంశాల్లో సహకరించాలని సీఎంను కోరామన్నారు. కాంగ్రెస్ లోకి వెళ్లాల్సిన అవసరం తమకు ఏముందని వారు ప్రశ్నించారు. సీఎంను మాత్రమే కాదని, సమస్యల పరిష్కారం కోసం మంత్రులనూ కలుస్తూనే ఉంటామన్నారు. తమపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఆపాలని, లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీ మారే ప్రసక్తే లేదని.. ప్రతిపక్షంలోనే ఉండి పోరాడతామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్సే మెజార్టీ స్థానాల్లో గెలుస్తుందని అన్నారు.

రాహుల్ ప్రజల్లోకి వెళ్తుంటే బీజేపీకి ఎందుకంత భయం?

- గుడికి వెళ్లడానికీ అసోం సీఎం అనుమతి కావాలా?
- అప్పట్లో బతుకమ్మ పేరుతో కవిత మాదిరిగానే ఇప్పుడు రామాలయం పేరుతో మోదీ సినిమా చూపిస్తున్నారు..
- అయోధ్య గుడికి కారకుడైన అడ్వాణీని సన్మానించారా?: జగ్గారెడ్డి

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): "రాహుల్‌గాంధీ ప్రజల్లోకి వెళుతుంటే.. బీజేపీకి ఎందుకంత భయం? రాహుల్ గాంధీ గుడికి పోవద్దా? అందుకు అసోం సీఎం అనుమతి తీసుకోవాలా?" అంటూ టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి ప్రశ్నించారు. అసోం ప్రజలకు ఇబ్బంది లేకుండా రాహుల్‌గాంధీ పాదయాత్ర సాగుతోందని, అయితే ప్రధాని మోదీ దగ్గర మెప్పు కోసమే పాదయాత్రను అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ అడ్డుకున్నారని ఆరోపించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన గాంధీ కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీని యాత్ర చేయకుండా అడ్డుకునే కుట్రను బీజేపీ చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడారు. మోదీ పాలనలో న్యాయమైన పాలన జరగట్లేదని, ధరల పెరుగుదలకూ అడ్డూ అదుపూ లేకుండా పోతోందని విమర్శించారు. దీనిపై ప్రజలను సంఘటితం చేసే పనిలో భాగంగా రాహుల్‌గాంధీ ‘న్యాయ్ యాత్ర’ను చేపట్టారని, అసోంలో రాహుల్ యాత్రను బీజేపీ వాళ్లు అడ్డుకోవడం ఎంతవరకు సమంజసం? అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగానే అసోం ప్రభుత్వం అక్కడ శాంతి భద్రతల సమస్యను సృష్టిస్తోందని ఆరోపించారు. నిన్న మొన్నటిదాకా బతుమ్మ పండుగే లేనట్లుగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బతుకమ్మ పేరుతో సినిమా చూపించిందని, ఇప్పుడు ప్రధాని మోదీ.. రామాలయం పేరుతో సినిమా చూపిస్తున్నారని విమర్శించారు. బీజేపీ నేతలు ఈ మధ్యనే కళ్లు తెరిచి.. రాములవారిని మొక్కాలని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. "రాములవారు పుట్టిన తర్వాత బీజేపీ పుట్టిందా? బీజేపీ పుట్టిన తర్వాత దేవుడు పుట్టాడా? ఆ పార్టీ పుట్టి కేవలం 40 ఏళ్లు అవుతుంది. సీతమ్మ, రాములవారు పుట్టి నాలుగు యుగాలవుతోంది. ప్రధాని మోదీ, ఇక్కడి బీజేపీ నేతలు సీతారాముల కల్యాణం చేస్తారో లేదో తెలియదు నేను. మాత్రం ప్రతియేటా చేస్తాను" అని వ్యాఖ్యానించారు. అయోధ్య గుడికి అసలు కారకుడు బీజేపీ సీనియర్ నేత అడ్వాణీ అని, ఆయన దేశమంతా తిరిగి అయోధ్యలో రామాలయం కట్టాలని ప్రచారం చేశారని చెప్పారు. అలాంటి అడ్వాణీని కనీసం సన్మానించారా? అంటూ బీజేపీ నేతలను నిలదీశారు. సొంత పార్టీ నేత అడ్వానీ త్యాగమే గుర్తించని బీజేపీ.. కాంగ్రెస్ పార్టీ నేతల త్యాగం గుర్తిస్తుందా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌ను ఎందుకు కలిశారో తనకు తెలియదు కానీ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎంను ఎమ్మెల్యేలు కలవాలంటే కుదిరేది కాదన్నారు. గత తొమ్మిదేళ్లలో దక్కని అవకాశాన్ని సీఎం రేవంత్ 2 నెలల్లోనే కల్పించారన్నారు. గత తొమ్మిదేళ్లుగా చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకే సీఎం రేవంత్‌పై బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

ఈసీ ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు

- అమోయ్‌కుమార్, సుశీల్‌కుమార్, శ్రీధర్‌లకు బాధ్యతలు..

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం తిరిగి పోస్టింగులు ఇచ్చింది. ఈమేరకు సీఎస్ శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే.. వేటు పడిన అధికారులకు అప్రాధాన్య పోస్టింగులు ఇవ్వడం గమనార్హం. అలాగే సుదీర్ఘకాలం పాటు సింగరేణి సంస్థ సీఎండీగా పని చేసి, ఇటీవల బదిలీ అయి వెయిటింగ్‌లో ఉన్న ఎన్.శ్రీధర్‌కు కూడా ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ఆయన్ను షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించింది. ఇప్పటివరకు ఈ బాధ్యతలు చూస్తున్న సాగునీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాను బాధ్యతల నుంచి రిలీవ్ చేసింది. ఈసీ ఆదేశాలతో పోస్టింగ్‌లు కోల్పోయి, వెయిటింగ్‌లో ఉన్న డి.అమోయ్‌కుమార్‌ను పశు సంవర్థక శాఖ జాయింట్ సెక్రటరీగా, టి.వినయ్‌కృష్ణారెడ్డిని వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీగా, ఎస్.హరీశ్‌ను రవాణా, రోడ్లు-భవనాల శాఖ జాయింట్ సెక్రటరీగా ప్రభుత్వం నియమించింది. గనుల శాఖ డైరెక్టర్‌గా ఉన్న పి.కాత్యాయనిదేవిని బదిలీ చేసి తెలంగాణ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్(టీఎస్ఐఆర్‌డీ) సీఈఓగా నియమించింది. ఈ పోస్టు అదనపు బాధ్యతలు చూస్తున్న పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాను రిలీవ్ చేసింది. అలాగే వెయిటింగ్‌లో ఉన్న నాన్-కేడర్ అధికారి సుశీల్‌కుమార్‌ను గనుల శాఖ డైరెక్టర్‌గా నియమించింది.

మే నెలలో ఎంసెట్.. నేడు షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే మే నెలలో ఎంసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ గురువారం విడుదలకానుంది. ఎంసెట్‌తోపాటు రాష్ట్రంలో నిర్వహించే ఇతర ప్రవేశ పరీక్షల షెడ్యూళ్లను కూడా ఇదే రోజున అధికారులు విడుదల చేయనున్నారు. ఈ ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ఆమోదం తెలిపారు. ఎంసెట్‌తోపాటు లాసెట్, ఐసెట్, ఈసెట్ వంటి ప్రవేశ పరీక్షలను నిర్వహించాల్సి ఉంది. ఈ సెట్ల షెడ్యూల్‌ను ముందుగానే విడుదల చేస్తే అందుకనుగుణంగా విద్యార్థులు సన్నద్ధం కావడానికి అవకాశముంటుంది. అధికారులు కూడా ప్రవేశ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు చేసుకునే వీలుంటుంది. ఈ నేపథ్యంలో ఆయా సెట్లను నిర్వహించే కమిటీలు, కన్వీనర్లను కూడా ప్రకటించనున్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామక ఫైల్‌ను సత్వరం ఆమోదించండి

తమిళిసైతో సీఎం, డిప్యూటీ సీఎం భేటీ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్‌తో భేటీ అయ్యారు. ప్రభుత్వం తరపున నిర్వహించే గణతంత్ర దినోత్సవాలకు హాజరు కావాల్సిందిగా ఆమెను ఆహ్వానించారు. గవర్నర్‌తో 20 నిమిషాలపాటు ప్రత్యేకంగా సాగిన సమావేశంలో.. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామకం, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పేర్లపై చర్చించినట్టు సమాచారం. టీఎస్‌పీఎస్సీకి చైర్మన్‌ను నియమించి ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్న ప్రభుత్వం.. రెండు రోజుల క్రితమే దానికి సంబంధించిన ఫైల్‌ను పంపింది. దానికి సత్వరం ఆమోదం తెలపాలని సీఎం, డిప్యూటీ సీఎం ఈ భేటీలో గవర్నర్‌కు విజ్ఞప్తి చేసినట్టు తెలిసింది. ఆ ప్రక్రియ ముగిసిన వెంటనే సభ్యులకు సంబంధించిన జాబితాను కూడా పంపిస్తామని చెప్పినట్టు సమాచారం. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నందున ఈ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు వారు గవర్నర్‌కు వివరించారు. తమిళిసై కూడా దీనికి సంబంధించి మరిన్ని వివరాలు అడిగి తెలుసుకున్నట్టు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. ఇక గవర్నర్ కోటా ఎమ్మెల్సీల విషయానికి వస్తే.. గత ప్రభుత్వం దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను ప్రతిపాదించగా, వారిని నామినేట్ చేయడానికి తమిళిసై నిరాకరించిన సంగతి తెలిసిందే. గవర్నర్ కోటాలో నియమితులయ్యేవారు సాహిత్యం, శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం, సమాజ సేవ వంటి రంగాల్లో నిష్ణాతులై ఉండాలి. ఈ అర్హతలు లేవంటూ దాసోజు, కుర్ర పేర్లను గవర్నర్ తిరస్కరించారు. ఈ నేపథ్యంలో.. రేవంత్ సర్కారు ఆ కోటా కింద ఇద్దరి పేర్లను ప్రతిపాదిస్తూ ఫైల్‌ను గవర్నర్‌కు పంపాలని భావించింది. అయితే ఈలోగా దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ కోర్టుకు వెళ్లారు. తమ పేర్లను తిరస్కరించడం చట్టవిరుద్ధమని.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా తమను నామినేట్ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని వారు కోర్టును కోరారు. దీంతో.. ఈ విషయం కోర్టులో ఉన్నందున తాను నిర్ణయం తీసుకోలేనని రేవంత్ సర్కారుకు గవర్నర్ స్పష్టం చేశారు. తాజాగా బుధవారం ఈ కేసును అడ్మిట్ చేసుకున్న న్యాయస్థానం.. ఎమ్మెల్సీలుగా కొత్త ప్రభుత్వం ప్రతిపాదించినవారిని గవర్నర్ నామినేట్ చేయకుండా స్టే ఇవ్వడానికి నిరాకరించింది. కాబట్టి ఈ ప్రక్రియపై ముందుకు వెళ్లొచ్చనే అభిప్రాయంలో ఉన్న ప్రభుత్వం.. ఆ విషయాన్ని గవర్నర్‌కు తెలిపింది. తాము ఈ కోటాకు అర్హులైన వ్యక్తులనే సిఫారసు చేస్తామని రేవంత్, భట్టి బుధవారం భేటీలో తమిళిసైకి వివరించగా.. దీనిపై న్యాయసలహా తీసుకుంటానని ఆమె చెప్పినట్టు తెలిసింది. ఫిబ్రవరి 2వ వారంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలు నిర్వహించే ఉద్దేశంతో ఉన్న నేపథ్యంలో రేవంత్, భట్టి ఆ విషయాన్ని కూడా గవర్నర్ వద్ద ప్రస్తావించినట్టు సమాచారం. కాగా.. గత కేసీఆర్ సర్కారు తీరుకు భిన్నంగా గణతంత్ర దినోత్సవాలకు గవర్నర్‌ను నేరుగా కలిసి ఆహ్వానించిన సీఎం, డిప్యూటీ సీఎం.. గవర్నర్ ప్రసంగానికి సంబంధించిన విషయాలను కూడా వివరించారు.



రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి

» డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఉత్తరయ్య



చట్టాలపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉత్తరయ్య

వనపర్తి రూరల్, జనవరి 24 : పాఠశాలల చదువులోనే విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఉత్తరయ్య విద్యార్థులకు సూచించారు. బుధవారం వనపర్తి పట్టణంలోని శ్రీసరస్వతి శిశుమందిరం పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు బాల్య దశలోనే చట్టాలపై అవగాహన కలిగి ఉంటే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. విద్యా సంస్థలు పాఠ్యాంశాల్లో న్యాయ శాస్త్రాన్ని చేర్పిస్తే మంచిదన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ శ్రీదేవి, సఖి కేంద్రం లీగల్ అడ్వయిజర్ కృష్ణయ్య, సఖి కేంద్రం కార్యనిర్వాహకురాలు కవిత, న్యాయవాది నరేంద్రబాబు, పా ఠశాల నిర్వాహకుడు సూర్యనారాయణ, ఉపాధ్యాయులు, లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం నేడు ధర్నా

పాన్‌గల్, జనవరి 24 : రవాణా రంగ కార్మికులపై కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జనవరి 25న కలెక్టరేట్ ఎదుట ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నా కార్యక్రమంలో రవాణా రంగ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ - సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బాలకిషన్ కార్మికులకు పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని రేమద్దుల గ్రామంలో డ్రైవర్ల యూనియన్ కార్యదర్శి లక్ష్మయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. హిట్ అండ్ రన్ చట్టం అమల్లోకి వస్తే డ్రైవల్లెవరూ పని చేయలేరని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా, ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఉపాధి కోల్పోయిన ఆటో, క్యాబ్ డ్రైవర్లకు జీవనభృతి ఇవ్వాలని, రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ మండల కన్వీనర్ సూర్యవంశం రాము, డ్రైవర్ యూనియన్ నాయకులు బాలకృష్ణయ్య, నరేష్, గోవర్ధన్‌రెడ్డి, లింగస్వామి, సురేష్, రాజమౌళి తదితరులున్నారు.

వేతనాలు పెంచుతారా.. సమ్మెలోకి పొమ్మంటారా

» ఐదు నెలల పెండింగ్ వేతనం తక్షణమే చెల్లించాలి

» తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్

ఖిల్లాఘణపురం, జనవరి 24 : వనపర్తి జిల్లా పరిధిలోని ఖిల్లాఘణపురం, ఆత్మకూరు, వీపనగండ్ల, రేవల్లిలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న శానిటేషన్ పేషెంట్ కేర్ సెక్యూరిటీ సూపర్‌వైజర్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన జీవో నంబర్ 60 ప్రకారం రూ.15,600 వేతనం పెంచి చెల్లిస్తారా, లేకపోతే కార్మికులు నిరవధిక సమ్మెలోకి పొమ్మంటారా అని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఖిల్లాఘణపురం మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆసుపత్రి డాక్టర్ రంజిత్‌రెడ్డితో కలిసి తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం సురేష్ మాట్లాడుతూ వనపర్తి జిల్లా పరిధిలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రాలలో శానిటరీ భద్రత పేషెంట్ కేర్ సూపర్‌వైజర్ విభాగాల మెయింటెనెన్స్ కోసం టెండర్లు దక్కించుకున్న వెంకటయ్య ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ ఇష్టారాజ్యంగా రూ.15,600 వేతనానికి గాను కేవలం రూ.11 వేలు చెల్లిస్తున్నారని అన్నారు. పీఎఫ్ 12 శాతం కార్మికుల వాటా 13 శాతం కాంట్రాక్టర్ వాటా చెల్లించాల్సి ఉండగా రెండు వాటాలు కార్మికుల వేతనం నుంచి కట్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనం విషయంలో కార్మికులను వేధింపులకు గురి చేస్తున్నారని, కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని సంబంధిత ఏజెన్సీ అవినీతి అక్రమాలపై విచారణ జరిపించి ఏజెన్సీ గుర్తింపును రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆసుపత్రి కార్మికులు రంగమ్మ, భాగ్యమ్మ, పద్మ, శివ, సంగీత, సాయి కృష్ణ, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పంపుహౌస్‌ను పరిశీలించిన అధికారులు



ఎండిపోయిన వాగును పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

కొత్తకోట, జనవరి 24 : పట్టణానికి తాగునీటిని అందించే వాగులోని పంపుహౌస్‌ను ఇరిగేషన్ అధికారులు బుధవారం పరిశీలించారు. వాగులో నీరు ఉంటేనే పంప్‌హౌస్‌లో నీరు పుష్కలంగా ఉండి పట్టణ ప్రజలకు ఎద్దడి లేకుండా సరఫరా చేయబడుతుందని మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్ అధికారులకు వివరించారు. వాగులో నీరు అడుగంటిపోవడంతో మునిసిపల్ సిబ్బంది ఇతర ప్రాంతాల నుంచి పైపులతో నీటిని నింపేందుకు ప్రయత్నాలు చేస్తున్నా సరిపోవడం లేదని చెప్పారు. శంకరసముద్రంలోకి భీమా ప్రాజెక్టు నీటిని వదిలితేనే వచ్చే వేసవిలో నీటి కష్టాలు తప్పవని వివరించారు. అంతకుముందు అధికారులు వాగులో పర్యటించారు. రెండురోజుల క్రితం తాగునీటి ఇబ్బంది గురించి కలెక్టర్‌కు విజ్ఞప్తి చేయడంతో అధికారుల్లో కదలిక వచ్చిందని మునిసిపల్ చైర్‌పర్సన్ సుకేశిని తెలిపారు. పంప్‌హౌస్‌ను పరిశీలించిన వారిలో ఇరిగేషన్ ఈఈ కేశవరావు, డీఈ రాజ్‌కుమార్, మునిసిపల్ ఏఈ చంద్రశేఖర్ ఉన్నారు.

ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరించిన జడ్పీ చైర్మన్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జనవరి 24 : పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం 2024 టేబుల్ క్యాలెండర్‌ను జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి బుధవారం కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ ఉద్యోగుల సేవలు మరువలేనివని తెలిపారు. గ్రామ పంచాయతీల అభివృద్ధిలో వారి పాత్ర కీలకమన్నారు. ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేసి పంచాయతీరాజ్ వ్యవస్థకు మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గట్టుమీది భానుప్రసాద్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ రషీద్, సహ అధ్యక్షుడు పరమేశ్వర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు లక్ష్మీకాంత్, విశ్వేశ్వర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, ఇబ్రహీం, నాగరాజు, గురురాఘవాచారి, సుజాత, రాజు, రాంబాబు, శ్రీశైలం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుకు రెండు కాడెద్దులు బహూకరణ

వనపర్తి రూరల్, జనవరి 24 : వనపర్తి మండల పరిధిలోని పెద్దగూడెం గ్రామంలో రైతు ఆంజనేయులుకు వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి రెండు కాడెద్దులను బహూకరించారు. నాలుగు రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన రైతు ఆంజనేయులుకు చెందిన కాడెద్దులు ప్రమాదవశాత్తు గండం చెరువులో పడి మృతి చెందాయి. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి రైతు ఆంజనేయులు ఇంటికి వెళ్లి తాను పెంచుకున్న రెండు కాడెద్దులను బహూకరించారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకుడు ఏడుదలి కొండయ్య, గోపయ్య, తిరుపతయ్యల తల్లి మృతి చెందడంతో వారిని పరామర్శించారు. అనంతరం పార్టీ కార్యకర్త ఉండెకోటి వెంకటమ్మ మృతి చెందడంతో వారి కుమారుడు ఉండెకోటి సాయికుమార్‌కు రూ.రెండు లక్షల రూపాయల పార్టీ భీమా చెక్కును అందజేశారు. అలాగే అనారోగ్యంతో ఎర్ర నాగన్న మృతి చెందడంతో అతని కుమారుడు రాములును పరామర్శించారు. కార్యక్రమంలో వనపర్తి మునిసిపల్ చైర్మన్ గట్టుయాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాణిక్యం, సర్పంచ్ కొండన్న, మండల నాయకులు చిట్యాల రాము, కురుమూర్తినాయుడు, ధర్మనాయక్, తిరుమలయ్య ఉన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన

వీపనగండ్ల, జనవరి 24 : మండల పరిధిలోని బొల్లారం, వల్లభాపూర్ గ్రామాల్లో బుధవారం భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపట్టిన సంక్షేమ పథకాలపై ఎంపీడీవో కథలప్ప ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వైద్య సిబ్బంది ప్రజలకు పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. యుబీఐ బ్యాంకు పెంట్లవెల్లి మేనేజర్ విజయ్‌కుమార్, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఊరేగింపు, సభ కరపత్రాలు విడుదల

రేవల్లి, జనవరి 24 : మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు ఛలో వనపర్తి ఊరేగింపు, బహిరంగ సభ కరపత్రాలను ఐఎఫ్‌టీయూ మండల అధ్యక్షుడు రామచంద్రయ్య ఆధ్వర్యంలో బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు కేసీఆర్ నిరంకుశ ప్రజాస్వామిక పాలన పట్ల విసిగి వేసారిన ప్రజలు కేసీఆర్‌ను ఇంటికి పంపారని 34 రోజులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మె చేస్తే కనీసం మాతో చర్చలు జరపడానికి కూడా కేసీఆర్ సిద్ధంగా లేకున్నారని అందుకే ప్రజలు తగిన బుద్ధి చెప్పారని అన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తోందన్నారు. గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న 60వేల మంది కార్మికులకు పనిభద్రత కల్పించాలని, న్యాయమైన వేతనాలను పెంచడానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లుల చెల్లింపునకు చర్యలు

» మండల సమావేశంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని శాలువాతో సన్మానిస్తున్న ఎంపీపీ మౌనిక దంపతులు

కొత్తకోట, జనవరి 24 : సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించడానికి చర్యలు తీసుకుంటానని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎంపీపీ గుంతమౌనిక అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు గత ప్రభుత్వం బిల్లులు చెల్లించడంలో నిర్లక్ష్యం చేసిందని రాష్ట్ర సర్పంచుల సంఘం సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. శంకరసముద్రంలోకి నీటిని విడుదల చేయకుంటే కొత్తకోటకు తాగునీటి ఎద్దడి ఉంటుందని తమ దృష్టికి వచ్చిందని, అధికారులతో మాట్లాడి రామన్‌పాడ్ నుంచి నీటి విడుదలకు కృషి చేస్తానన్నారు. రైతుబంధుపై రివ్యూ నడుస్తోందని, గుట్టలు, పుట్టలు కాకుండా సాగు చేస్తున్న భూమికి మాత్రమే డబ్బులు వేస్తామన్నారు. మిషన్ భగీరథ అధికారులు సర్వసభ్య సమావేశంలో కన్పిస్తే మళ్లీ వాళ్ల ఆచూకీ ఉండదని ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మణ్‌నాయక్, సర్పంచ్ దేవి, కోఆప్షన్ సభ్యుడు అల్లాబాష ఆరోపించారు. అంతకుముందు ఎమ్మెల్యేను ఎంపీపీ దంపతులు ఘనంగా సన్మానం చేశారు. వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, మార్కెట్ చైర్మన్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి తహసీల్దార్ బాల్‌రెడ్డి, ఎంపీడీవో రవీంద్రబాబు, ఏవో షేక్ మున్నా, ఎంపీటీసీ సభ్యులు లక్ష్మీ, రాధ, రంగారెడ్డి, శేషిరెడ్డి, సర్పంచులు శేఖర్‌రెడ్డి, శివరాజ్, విశ్వనాథం, కృష్ణ, గాదంరాణి, సంధ్య, హిమబిందు, శారద, లావణ్య, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

» మండల సమావేశంలో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి



పదవీకాలం పొడిగించాలని ఎంపీపీకి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచులు

పాన్‌గల్, జనవరి 24 : గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలాభివృద్ధి కోసం గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రారంభించాలని కోరారు. అదేవిధంగా వచ్చే వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని సూచించారు. అంతకుముందు శాఖల వారీగా అధికారులు నివేదికలు చదివి వినిపించారు. కాగా సర్పంచుల పదవీకాలం మరో ఆరునెలలు పొడిగించాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సర్పంచులు ఎంపీపీకి వినతిపత్రం అందజేశారు.

సర్పంచులకు ఘన సన్మానం

మండలంలోని సర్పంచులకు ఈనెల 31తో పదవీకాలం ముగుస్తున్నందున బుధవారం సర్వసభ్య సమావేశం అనంతరం ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్పంచులను ఘనంగా సన్మానించారు. జడ్పీటీసీ సభ్యురాలు మూడావత్ లక్ష్మీ, వైస్ ఎంపీపీ కవిత, మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్‌నాయక్, ఎంపీడీవో రఘురాములు, ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, ఏపీవో కురుమయ్య, ఏపీఎం సక్రునాయక్, వ్యవసాయ శాఖ ఏవో సాజిద్‌రెహమాన్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఉత్తమమైన విద్య అందించాలి

» ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

» అంగన్‌వాడీ టీచర్లకు పదోన్నతి ఆర్డర్ కాపీలు అందజేత



అంగన్‌వాడీ టీచర్లకు పదోన్నతి ఆర్డర్ కాపీలు అందజేస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జనవరి 24 : అంగన్‌వాడీ టీచర్లు చిన్నారులకు ఉత్తమమైన విద్యాబోధన చేయాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. వనపర్తి ప్రాజెక్టు పరిధిలోని మినీ అంగన్‌వాడీ టీచర్లను అప్‌గ్రేడ్ చేస్తు ప్రభుత్వం నుంచి అందిన పదోన్నతి ఆర్డర్ కాపీలను బుధవారం ఆయన కలెక్టరేట్ ఆవరణలో అంగన్‌వాడీలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు పూర్వపు విద్య భవిష్యత్ మార్గాలను నిర్దేశిస్తుందన్నారు. పదోన్నతి పొందిన టీచర్లు ఉత్తమమైన విద్యాబోధన చేసి విద్యార్థుల భవితకు గట్టి పునాదులు వేయాలని సూచించారు. కాగా వనపర్తి ప్రాజెక్టు పరిధిలో మొత్తం 27 మంది టీచర్లు విధులు నిర్వర్తిస్తుండగా మొదటి విడతగా 19 మంది టీచర్లకు పదోన్నతి కల్పిస్తు ప్రభుత్వం ఆర్డర్ కాపీలు జారీ చేసింది. కార్యక్రమంలో సీడీపీవో కృష్ణచైతన్య, సూపర్‌వైజర్లు హజీరా, జ్యోతి, సుధ, ఈదమ్మ, టీచర్లు పాల్గొన్నారు.

బాలురు, బాలికలు అందరూ సమానమే

» అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థినులతో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వనపర్తి రూరల్, జనవరి 24 : ఉన్నత చదువులో బాలురు, బాలికలు అందరూ సమానమే అని అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) సంచిత్ గంగ్వార్ అన్నారు. బుధవారం వనపర్తి పట్టణంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖలోని జిల్లా మహిళా సాధికారిక కేంద్రం వారి ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సైన్స్ ఫెయిర్‌లో జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. దేశ అత్యున్నత స్థాయిలో రాష్ట్రపతి, క్రీడల్లో సానియా మీర్జా, సైనానెహ్వాల్, పీవీ సింధు, ఇలా ఎందరో మహిళలు ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పరుచుకొని విజయాలు సాధించారని గుర్తు చేశారు. అనంతరం బాలిక దినోత్సవం ఉత్సవాల్లో భాగంగా వివిధ పాఠశాలల్లో నిర్వహించిన కబడ్డీ, వ్యాసరచన, డ్రాయింగ్, స్లోగస్, రైటింగ్, సైన్స్‌ఫెయిర్లలో ప్రదర్శన ఇచ్చిన విద్యార్థులకు ప్రశంసపత్రాలు, బుక్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రామమహేశ్వర్‌రెడ్డి, డీవైఎస్‌వో సుధీర్‌రెడ్డి, జీసీడీవో సుబ్బలక్ష్మి, సీడీపీవో కృష్ణచైతన్య డిస్ట్రిక్ మిషన్ కోఆర్డినేటర్ భాస్కర్, కేజీబీవీ ఎస్‌వో లోహిత, డీసీపీయు నుంచి రాంబాబు, జిల్లా మహిళా సాధికారిక కేంద్రం నుంచి శ్రీవాణి, సలోమి, సుమ, ప్రమీల, వివిధ పాఠశాలల నుంచి హాజరైన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలలో...

శ్రీరంగాపూర్ : మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షురాలు గాయత్రి, ఎంపీడీవో ప్రసన్నకుమారి మాట్లాడారు. అనంతరం బాలికలు ధైర్య సాహసాలతో రకరకాల విన్యాసాలు ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి, ఎస్సై మునుస్వామి, ఉపాధ్యాయులు, బాలబాలికలు పాల్గొన్నారు.

వెల్ఫేర్ బోర్డులో ఉన్న నిధులు ఖర్చు చేయాలి

» భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొబ్బిలి నిక్సన్



సమావేశంలో మాట్లాడుతున్న బొబ్బిలి నిక్సన్

వనపర్తి టౌన్, జనవరి 24 : వెల్ఫేర్ బోర్డులో ఉన్న నిధులను నిర్మాణ రంగ కార్మిక వర్గానికి ఖర్చు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొబ్బిలి నిక్సన్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికవర్గం పోరాడి సాధించుకున్న లేబర్ చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదించి కార్మికవర్గాన్ని కష్టాల్లోకి నెట్టిందన్నారు. ఎనిమిది గంటల పనిదినాలను పన్నెండు గంటలు చేసి బీజేపీ పాలిత ప్రాంతాల్లో అమలు చేస్తోందని మండిపడ్డారు. వెల్ఫేర్ బోర్డులో ఉన్న నిధులను వెంటనే విడుదల చేసి 60 సంవత్సరాలు దాటిన కార్మికులకు రూ.ఆరు వేల పెన్షన్, స్కాలర్‌షిప్‌లు తదితర వాటికి ఖర్చు చేయాలన్నారు. బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 26న జిల్లా కేంద్రంలో చేపట్టే వాహన ర్యాలీని విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు పుట్ట ఆంజనేయులు, వెంకటయ్య, ఓంకార్, నరేందర్, వసంత్, రాబర్ట్, నాగరాజు, నరసింహ, బలరాం, గోవిందు, వెంకటన్న, శ్రీను, కురుమూర్తి తదితరులున్నారు.

నాయీ బ్రాహ్మణులకు సముచిత స్థానం కల్పించాలి

» నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు అశ్విని రమేష్



వనపర్తిలో కర్పూరి ఠాకూర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయీ బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు

వనపర్తి టౌన్/పెబ్బేరు/కొత్తకోట/ఖిల్లాఘణపురం, జనవరి 24 : నాయీ బ్రాహ్మణులకు అన్ని రాజకీయ పార్టీలు సముచిత స్థానం కల్పించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అశ్వినిరమేష్ అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని నాయీ బ్రాహ్మణ సేవా సమితి కార్యాలయం ముందు భారతరత్న అవార్డు గ్రహీత, బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్ శత జయంతిని నాయీ బ్రాహ్మణులు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కర్పూరి ఠాకూర్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సదుర్ల నాగరాజు, పట్టణ అధ్యక్షుడు పూడూరు మోహన్, గౌరవ అధ్యక్షుడు సదుర్ల రామస్వామి, లేబర్ యూనియన్ అధ్యక్షుడు సదుర్ల రమేష్‌బాబు, సదుర్ల ఆనంద్, శ్రీనివాసులు, చింతకుంట ఆంజనేయులు, సదుర్ల చిన్నయ్య నారందాస్ రఘు, అశ్విని చంద్రకుమార్, మహాలంక రఘు, అశ్విని పవన్, సోనాల గోవిందు తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా, పెబ్బేరులోని సుభాష్ చౌరస్తాలో కర్పూరి ఠాకూర్ శత జయంతి ఉత్సవాలను నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బీఎస్పీ రాష్ట్ర నాయకుడు గణపురం కృష్ణ హాజరై, కర్పూరి ఠాకూర్ చేసిన సేవలను కొనియాడారు. సంఘం మండల అధ్యక్షుడు సదుర్ల శంకర్, నారాయణదాసు, బాలకృష్ణ, శాఖాపూర్, పరమేష్, సదుర్ల శాంతన్న, నారాయణదాసు, పరుశురాం, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట పట్టణంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరాములు, పట్టణ అధ్యక్షుడు కృష్ణయ్య, గౌరవ అధ్యక్షుడు భాస్కర్, ప్రధాన కార్యదర్శి యాదగిరి, సంయుక్త కార్యదర్శి పెద్ద రాజేష్, కోశాధికారి రాజేష్, జిల్లా నాయకులు వెంకటేష్, శంకర్, రామస్వామి, భాస్కర్ తదితరులు కర్పూరి ఠాకూర్ శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

ఖిల్లాఘణపురంలో బీజేపీ ఓబీసీ జిల్లా కార్యదర్శి బెన్నూరు ఆశన్న ఆధ్వర్యంలో కర్పూరి ఠాకూర్ శత జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, వంశీ, యాదగిరి, సత్యనారాయణ, శ్రీకాంత్, శ్రీనివాసులు తదితరులున్నారు.

శ్రీరంగనాథ స్వామి ఆలయ హుండీ లెక్కింపు

శ్రీరంగాపూర్, జనవరి 24 : శ్రీరంగనాథస్వామి ఆలయ హుండీని బుధవారం ఆలయ ఈవో శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో లెక్కించారు. నాలుగు నెలలకు గాను రూ.ఐదు లక్షల 54వేల 564 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. ఆలయంలో ఈ నెల 26న అర్చిత కల్యాణం, పౌర్ణమి అభిషేకం, విష్ణు సహస్ర తులసీ అర్చన కార్యక్రమాలు ఉంటాయని ఆయన చెప్పారు.

ఓటరు దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

మదనాపురం, జనవరి 24 : జాతీయ ఓటరు దినోత్సవాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ అబ్రహాంలింకన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఓటర్స్‌డే సందర్భంగా మండల కేంద్రంలో పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం స్థానిక గ్రంథాలయం దగ్గర ఓటరు ప్రతిజ్ఞ కార్యక్రమం ఉంటుందని, మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, యువకులు పాల్గొనాలని ఆయన తెలిపారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

వీపనగండ్ల, జనవరి 24 : తాగునీటి సమస్య తలెత్తకుండా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని ఎంపీడీవో కథలప్ప తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని పరిషత్ కార్యాలయంలో భగీరథ తాగునీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రాబోయే వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో ఉన్న తాగునీటి సమస్యలు, వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో మిషన్ భగీరథ ఏఈలు దేవన్న, రామాంజనేయులు, ఎంపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలను నివారించాలి

వనపర్తి టౌన్, జనవరి 24 : ఇటీవల జిల్లా కేంద్రంలో వేళాపాల లేకుండా జరుగుతున్న అప్రకటిత విద్యుత్ కోతలను నివారించాలని యువజన కాంగ్రెస్ మీడియా సెల్ జిల్లా కన్వీనర్ నందిమల్ల చంద్రమౌళి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని టీఎస్ఎస్‌పీడీసీఎల్ కార్యాలయంలో సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్‌ను కలిసి విద్యుత్ కోతలపై వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో జరుగుతున్న అప్రకటిత విద్యుత్ కోతల వల్ల పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో దాస్‌నాయక్, షేక్‌షావలి, బాలేసాబ్, అహమ్మద్, నవీన్, వెంకటేష్, శివ, చందు, రమేష్, నందిమల్ల నిఖిల్, చంద్ర తదితరులున్నారు.

మూలమల్ల గ్రామంలో జీవ వైవిధ్య సదస్సు

ఆత్మకూరు, జనవరి 24 : జీవ వైవిధ్య యాజమాన్య కమిటీ ఆధ్వర్యంలో ఏషియన్ బర్డ్స్ సెన్సెస్-2024 కార్యక్రమంలో భాగంగా పక్షులను లెక్కించే కార్యక్రమం చేపట్టినట్లు జీవ వైవిధ్య జిల్లా కోఆర్డినేటర్ మీసాల భరత్‌కుమార్ తెలిపారు. గ్రామ పరిసర ప్రాంతంలోని చెరువులో అనేక రకాల పక్షులను గుర్తించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రశాంతిరాజు మాట్లాడుతూ ఊర చెరువులో అనేక రకాల పక్షులు నివాసం ఉంటున్నాయని వాటిని కాపాడి జీవ వైవిధ్యాన్ని పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాదత్‌అలీ, కమిటీ సభ్యులు రంగన్న, దేవన్న, రాములు, ఆనంద్, లక్ష్మణ్, లాల్, మహేష్, వెంకటమ్మ, మజేష్, అనంతమ్మ, శ్వేత, కురుమూర్తి తదితరులున్నారు.

విద్యార్థులకు చెకుముకి సైన్స్ పోటీలు

గోపాల్‌పేట, జనవరి 24 : మండల కేంద్రంలోని జడ్పీ హెచ్ఎస్ ఆవరణలో విద్యార్థులకు బుధవారం చెకుముకి సైన్స్ టాలెంట్ పోటీలను నిర్వహించారు. పరీక్షకు సంబంధించిన పోస్టర్‌ను పాఠశాల హెచ్ఎం రమాకాంత్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు 27వ తేదీన టాలెంట్ టెస్టు నిర్వహించి, ఆ పోటీలో గెలుపొందిన వారికి జిల్లా స్థాయిలో పోటీలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయలక్ష్మి, శేషయ్య, నాగరాజు, భీముడు, రాందేవ్‌రెడ్డి, యాదగిరి, సంధ్య, అర్జున్ తదితరులున్నారు.

దోస్త్ అడ్మిషన్లపై విద్యార్థులకు అవగాహన

పాన్‌గల్, జనవరి 24 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దోస్త్ అడ్మిషన్లపై ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో దోస్త్ నోటిఫికేషన్ ద్వారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లను చేపట్టి సీట్లను భర్తీ చేయనుందని, వనపర్తి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిష్ణాతులైన అధ్యాపకులచే విద్యా బోధనలు ఉంటాయని, దోస్త్ అడ్మిషన్లలో తమ మొదటి ప్రాధాన్యతలో వనపర్తి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కోసం దరఖాస్తు చేసుకొని సీటు పొందే సువర్ణ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం శ్రీనివాసులు, కొంకల గట్టయ్య, పాషా పాల్గొన్నారు.

మంచినీటి సౌకర్యం కల్పించాలి

» ఎంపీ బండి సంజయ్‌కి బీజేపీ నాయకుల వినతి

ఆత్మకూరు, జనవరి 24 : మండల పరిధిలోని దేవరపల్లి గ్రామంలో ప్రజలకు మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్‌ను కోరినట్లు మక్తల్ అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నాయకులు ఎంపీ బండి సంజయ్‌ను కలిసి సమస్యను వివరించారు. దేవరపల్లి గ్రామంలో ఊరి మధ్యలో సెంట్రల్ రైల్వేట్రాక్ ఉన్న కారణంగా దిగువ కాలనీలో మంచినీటి సౌకర్యం లేదని, కేంద్ర రైల్వే శాఖ మంత్రికి సమస్యను విన్నవించి పరిష్కరించే విధంగా చూడాలని బండి సంజయ్‌ని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సహదేవ్, ఆంజనేయులు, చెన్నయ్య ఉన్నారు.

అనారోగ్యానికి గురైన మిత్రుడికి పూర్వ విద్యార్థుల చేయూత

ఖిల్లాఘణపురం, జనవరి 24 : మండలంలోని మానాజీపేట గ్రామానికి చెందిన వడ్ల చంద్రశేఖర్ గుండె సంబంధిత వ్యాధితో హైదరాబాద్ సూరారం మల్లారెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. 1987-88 విద్యా సంవత్సరంలో మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన తోటి పూర్వ విద్యార్థుల సహకారంతో అడ్వకేట్ రాంమోహన్, మానాజీపేట్ రాజవర్ధన్‌రెడ్డి అనారోగ్యానికి గురైన మిత్రుడు వడ్ల చంద్రశేఖర్‌కు బుధవారం ఆసుపత్రిలో రూ.50వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదే బ్యాచ్ పూర్వ విద్యార్థి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి బాధిత మిత్రుడికి మెరుగైన వైద్య సేవలకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

వనపర్తి రూరల్, జనవరి 24 : వనపర్తి మండల పరిధిలోని కిష్టగిరి గ్రామంలో బుధవారం మృతుడి కుటుంబానికి ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ వనపర్తి టౌన్ ప్రెసిడెంట్ శ్రీరాములు, జిల్లా యువజన నాయకుడు ఏర్వ సాయి ప్రసాద్‌యాదవ్‌లు రూ.పది వేల ఆర్థిక సహాయం అందించారు. పదిహేను రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన పెద్దముక్కుల నరేష్ అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయంగా రూ.10 వేల నగదును భార్య రేణుకకు అందించారు. నగదును పిల్లల చదువు కోసం వినియోగించుకోవాలని కోరారు. భవిష్యత్‌లో పిల్లల చదువుల కోసం తమవంతు సహకరిస్తామని వారు తెలిపారు.